'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'


వాకర్స్‌తో విశ్వేశ్వర్‌రెడ్డి

గచ్చిబౌలి: చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బొటానికల్‌గార్డెన్‌లో సందడి చేశారు. ఆదివారం ఉదయం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, ఇతర నాయకులతో కలిసి ఆయన గార్డెన్‌కు చేరుకుని వాకర్స్‌ను కలిసి తనకు ఓటేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కేంద్రంలో మరోసారి భారీ మెజార్టీతో గెలువడం, ప్రధానిగా నరేంద్రమోదీ కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్లకాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో చేసిన అభివృద్ధి పనులను వారికి వివరించారు. తనను గెలిపిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలన్నీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బీజేపీ రోడ్ షో..

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం చేపట్టిన బీజేపీ రోడ్ షో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, రవికుమార్ యాదవ్, పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్ షోకు భారీ స్పందన లభిస్తుందని ప్రతి డివిజన్‌లో బీజేపీ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ మరోసారి ఆరు గ్యారెంటీలు పేరు చెప్పి దేశ ప్రజలను కూడా మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందన్నారు.

సొంతింటి కల నిజం చేసిన నాయకుడు కేసీఆర్

ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ


డబుల్ బెడ్రూమ్ వాసులతో ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: పేదల సొంతింటి కలను నిజం చేసిన చేసిన గొప్ప నాయకుడు మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు అని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీ వద్దనున్న డబుల్ బెడ్రూమ్ సముదాయంలో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూమ్‌లను నిర్మించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పేదలకు భారం కాకూడదనే ఉద్దేశంతో అన్ని రకాల మౌలిక వసతులతో ఇల్లు నిర్మించడం జరిగిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ హయాంలో కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతు బంధు, రైతు భీమా వంటి అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో గుల్‌మొహర్ పార్కు కాలనీ అధ్యక్షులు షేక్‌ఖాసీం, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ఖాసీం, లియాఖత్ పాల్గొన్నారు.

ఘనంగా పుట్టిన రోజు వేడుకలు


కొమిరిశెట్టిసాయిబాబాను సన్మానించిన నాయకులు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఖాజాగూడలోని ఆయన నివాసంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, స్నేహితులు, బంధువులు కలిసి శాలువాలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు కమిటీ సభ్యుడు దారుగుపల్లి నరేష్, బీఆర్ఎస్ నాయకులు రమేష్‌గౌడ్, చెన్నంరాజు, శ్రీనివాస్, యాదగిరి, జగదీష్ పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం బెంగళూరుర్‌కి చెందిన భరతనాట్య కళాకారిణి పార్వతి బాలకృష్ణన్ తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఇందులో తోడయ మంగళం, శ్రీనగరలహరి, అన్నమాచార్య కీర్తన, జావళి, తిల్లాన అంశాలను ప్రదర్శించి అలరించారు. నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య గురువు క్రాంతి కిరణ్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో వినాయకకౌతం, జతిస్వరం, మూషికవాహన, రామ కోదండరామ, పుష్పాంజలి, జయలక్ష్మి, దశావతారాలు, తిల్లాన తదితర అంశాలను సమన్వి, తన్వి, మీరు, రాగ, అక్షర, సౌగంధిక, అంజలి, పర్ణిక, లలిత తదితరులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం


రోలర్‌లను అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: ప్రతి ఒక్కరు తమ దినచర్యలో వారికి నచ్చిన క్రీడను చేర్చుకుని ప్రతి రోజు సాధన చేస్తే ఆరోగ్య పరంగా ఎంతో మేలు జరుగుతుందని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పంచవటి కాలనీలోని క్రీడా మైదానాలను చదును చేసేందుకు అవసరమయ్యే మూడు రోలర్‌లను తన సొంత నిధులతో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని పార్కులకు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేశామన్నారు. కాలనీలో బాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ క్రీడాకారులకు పిచ్‌లను తయారు చేసుకునేందుకు రోలర్‌లు కావాలని కోరడంతో వాటిని అందజేశామన్నారు, వాటిని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులుగా రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం, రాఘవరెడ్డి, పంచవటి కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా 'బర్లకుంట క్లీనప్ డ్రైవ్'


క్లీనప్ డ్రైవ్‌లో సంస్థ సభ్యులు

రాయదుర్గం: చెరువుల 'క్లీనప్ డ్రైవ్' కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ధృవాంశ్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలోని బర్లకుంటలో క్లీనప్‌డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కుంట పరిసరాలు, కుంట చెరువులో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలను ధృవాంశ్ సంస్థ సీఈఓ మధులికాచౌదరి ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా మధులికాచౌదరి మాట్లాడుతూ.. ధృవాంశ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నేక్నాంపూర్ చెరువు, ముష్కిచెరువు, బర్లకుంటలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మూడు చెరువుల వద్ద 130 మంది వలంటీర్లతో మొత్తం 850 కిలోల వ్యర్థాలను తొలగించామన్నారు.

లక్ష్యం ఘనం.. ఆచరణ శూన్యం!

- అందుబాటులోకి రాని నిథమ్‌లో శిల్పాల పార్కు
- పాముల బెడద పేరుతో అనుమతివ్వని వైనం
- వినియోగంలోకి తేవాలంటున్న సందర్శకులు
- దృష్టి సారించని అధికారులు


నిథమ్‌లోని రాతి శిల్పాల పార్కులో ఏర్పాటు పాత్‌వే




పార్కుల ఏర్పాటు చేసిన రాతి శిల్పాలు

రాయదుర్గం: సహజత్వాన్ని కోల్పోకుండా మట్టి, భారీ బండరాళ్లతో కూడిన గుట్టకు ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాటు చేసిన శిల్పాలపార్కు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. ఎంతో ఉన్నతమైన లక్ష్యంతో ప్రజలందరికీ తిలకించే అవకాశం కల్పించాలన్న లక్ష్యం ఆచరణలో మాత్రం ఉత్తదే అన్నట్లుగా మారిపోయింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న రాక్‌జోన్‌గా పిలిచే ప్రాంతానికి కొత్త అందాన్ని తీసుకొచ్చారు. కోట్ల రూపాయలను వెచ్చించి దీనికి ఒక రూపు తీసుకొచ్చి వదిలేస్తే ఎలా అనే ప్రశ్న అందరిలోనూ మెదులుతోంది. దేశంలోనే అత్యుత్తమ పర్యాటక ఆతిథ్య విద్యా, శిక్షణా సంస్థగా పేరొందిన గచ్చిబౌలి లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో రాక్‌జోన్ శిల్పాల పార్కు అందరినీ ఇప్పటికీ ఆకట్టుకునేలా ఉంది. గచ్చిబౌలిలోని నిథమ్ ప్రాంగణాన్ని పర్యాటక, ఆతిథ్య విద్యా, శిక్షణ జాతీయ సంస్థగానే గాకుండా పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అయిదేళ్ల క్రితం సుమారు కోటిన్నర రూపాయల వ్యయంతో క్యాంపస్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ.. ఇక్కడ పాములు ఉన్నాయంటూ ఎవరినీ లోపలికి ప్రవేశం కల్పించడం లేదు. రూ. కోట్లతో ఏర్పాటు చేసిన పార్కులోని పాములు బెడద తొలగించి సందర్శకులకు వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

రాయలసీమ రాళ్లతో..

నిథమ్ క్యాంపస్‌లో అయిదు ఎకరాల స్థలంలో సహజ సిద్ధంగా విస్తరించిన రాక్‌జోన్‌లో ఈ పార్కు కొనసాగుతోంది. మొదట గుట్టపైకి రాకపోకల కోసం పాత్‌వేను అందంగా నిర్మాణం చేశారు. ఆ తర్వాత అక్కడక్కడా గుట్టపై చరిత్రను తెలిపేలా రకరకాల శిల్పాలను ఏర్పాటు చేసేందుకు రాయలసీమలోని జమ్మలమడుగు, ఆళ్లగడ్డ నుంచి ప్రత్యేకంగా బండరాళ్లను తెప్పించి వాటిని శిల్పాలుగా ప్రత్యేకంగా శిల్పులచే నిథమ్ క్యాంపస్ లోనే తయారు చేయించడం విశేషం. 40 మంది శిల్పకళాకారులు అందమైన 20 రాతి కళాఖండాలను మలిచారు.

ఇలా చేస్తే ఉపయోగం

- శిల్పాలపార్కును ప్రజలంతా తిలకించేందుకు అవకాశం కల్పించాలి
- రెస్టారెంట్,మూత్రశాలలు, మరుగుదొడ్లు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలి
- ప్రతి వీకెండ్స్‌లో ఏదో ఒక కార్యక్రమం ఆంపీథియేటర్‌లో ఉండేలా ఏర్పాట్లు చేయాలి
- పాముల బెడదను తొలగించి సందర్శకులకు అనుమతివ్వాలి
- ప్రధాన భవనానికి ఆనుకొని ఉండే రామమ్మకుంటలో బోటింగ్‌సౌకర్యం కల్పించాలి
- వీటన్నింటిని తిలకించేందుకు వచ్చే వారికి అందరూ తిలకించే అవకాశం కలిగేలా బారి కెట్లు ఏర్పాటు చేయాలి.
- క్యాంపస్‌లోకి ఎవరూ వెళ్లకుండా శిల్పాల పార్కు, రామమ్మకుంట, ఆంపీథియేటర్, రెస్టారెంట్, ప్రాంగణంలోని గణపతి దేవాలయం తిలకించేలా మాత్రమే ఏర్పాట్లు చేయాలి.

పాత్‌వేకు ఇరువైపులా మిగతా గుట్ట ప్రాంతమంతా రకరకాల పూలమొక్కలు, అందమైన పచ్చికబయల్లను ఏర్పాటు చేశారు.వాటిని తిలకించేందుకు వచ్చే వారికోసం మూత్రశాలలు, ప్రత్యేక రెస్టారెంట్, బయటకు వెళ్లడానికి ప్రత్యేకంగా గేటును కూడా ఏర్పాటు చేశారు. అయితే యాంపీథియేటర్ ప్రాంతంలో పలు ప్రైవేటు కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు.

పార్కులోని శిల్పాలు ఇవే..

నిథమ్ రాక్‌జోన్ శిల్పాల పార్కులో ఆంధ్రప్రాంతాన్ని క్రీస్తుశకం 1 నుంచి 16వ శతాబ్దం వరకు పరిపాలించిన శాతవాహనులు, కాకతీయులు, రాష్ట్రకూటులు, బాదామీ చాళుక్యులు, కళ్యాణ చాళుక్యులు, ఇక్ష్వాకుల కాలం నుంచి విజయనగర రాజుల కాలానికి చెందిన శిల్పాలున్నాయి. శిల్పాలలో పున్నఘాట, ద్వారపాలిక, మిథున స్కల్పచర్, ఉమామహేశ్వర, సూర్య, నాగారాజ, మెడాలియన్, యమున,తారా, కుబేరుడు, ఉమామహేశ్వరులు, వర్ధమాన మహావీర, జైన్ సరస్వతి, ఏ- లేడీవీరగల్, నాగిని, కోలాటంసీన్, గోవర్ధన్‌గిరిధారి కృష్ణ,అర్ధనారి వేణుగోపాలుడు ఇలా మొత్తం 20 శిల్పాలు ఉన్నాయి.

23న హనుమాన్ విజయయాత్ర

రాయదుర్గం: హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో వీరహనుమాన్ విజయయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ గొల్కొండ సేవా ప్రముఖ్ నిఖిల్‌యాదవ్ తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు రాయదుర్గంలోని జీహెచ్‌ఎంసీ ఆఫీస్ నుంచి యాత్ర ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కారు ఢీకొని పాదచారుడి మృతి

మియాపూర్: కారు ఢీకొన్ని పాదచారుడు మృతి చెందిన ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రమేష్(53) కూకట్‌పల్లి ఎల్లమ్మబండలో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటూ కూలీ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం పని నిమిత్తం మియాపూర్‌కు వచ్చిన రమేష్ మియాపూర్ మెట్రో పిల్లర్ నెం-633 వద్ద కల్వరి టెంపుల్ నుంచి అవతలి వైపుకు జాతీయ రహదారి దాటుతుంగా సునీల్ అనే వ్యక్తి కారులో వచ్చి రమేష్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నీలం మధుకు సన్మానం


నీలం మధుకు సన్మానిస్తున్న కాలనీవాసులు

పటాన్‌చెరు టౌన్: ఎంపీ ఎన్నికలలో తనను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి నీలం మధు అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పీజేఆర్ కాలనీ వాసులను కోరారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ మద్దతును ప్రకటించారు. అనంతరం మధు కాలనీలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాలనీవాసులకు భరోసా ఇచ్చారు. కాలనీవాసులు నాగేంద్ర, రంజిత్, మణికుమార్, వంశీ బాలాజీ, రాజా, సురేష్, రవి వర్మ, అశోక్, గోపాల్, జగదీష్, రవిచంద్ర శాస్త్రి, భాస్కరరావు, హరీశ్, కోటేశ్వర రావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహావీర్ జయంతి

పటాన్‌చెరు టౌన్: మహావీర్ జయంతి జైన సమాజానికి ఇష్టమైన పండుగ అని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం మహావీర్ జయంతి సందర్భంగా జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట ఉన్న మహావీర్ విగ్రహానికి నివాళులర్పించారు. జలగరీ ఎట్టయ్య, బీఆర్ఎస్ పార్టీ మైనారిటీ వైస్ ప్రెసిడెంట్ అజ్మత్, నాయకులు పాల్గొన్నారు.

పదేళ్ల బీజేపీ హయాంలో అభివృద్ధి శూన్యం

రంజిత్‌రెడ్డి


వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశమైన రంజిత్‌రెడ్డి

గచ్చిబౌలి: పదేళ్ల కాలంలో దేశంలోని బీజేపీ పాలనలో అభివృద్ధి శూన్యమని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ జి. రంజిత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మై హోమ్ భుజలో ఆదివారం ఏర్పాటు చేసిన వివిధ కాలనీల అసోసియేషన్ల సభ్యులతో అల్పాహార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సంక్షేమ పథకాలు దేశంలో కనుమరుగయ్యాయని, కార్పొరేట్ శక్తుల కోసమే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందనేది గత పదేళ్లలో నిరూపితమైందన్నారు. పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. తనను గెలిపిస్తే అన్ని రకాల కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జీ జగదీశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు, వివిధ కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఉరిటి వెంకట్రావు

హఫీజ్‌పేట్ : చందానగర్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఉరిటి వెంకట్రావు ఆదివారం చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్ రెడ్డి సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని మెజార్టీ సాధిస్తుందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నగరానికి ఆనుకొని ఉన్న శేరిలింగంపల్లి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపేటి జైపాల్, జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

భారీ బైక్ ర్యాలీ

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బైక్ ర్యాలీకి ముఖ్య అతిథిగా రంజిత్‌రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలోని బైకుల ర్యాలీ నిర్వహించే రోడ్లన్ని పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీగా చేరుకొని రంజిత్‌రెడ్డికి మద్దతు పలికారు. ఈ సందర్భంగా రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ..చేవెళ్ల పార్లమెంట్‌లో భారీ మెజార్టీతో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ ర్యాలీలో జెరిపేటి జైపాల్, జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, రఘునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

'షో'నియాసింగ్ సందడి



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లో సినీనటి సోనియాసింగ్ సందడి చేశారు. ఇక్కడ ఏర్పాటుచేసిన సరోజ్ ఫ్యాబ్రిక్స్‌ను ఆమె ప్రారంభించారు. హైదరాబాద్ నగరంలో ప్రారంభించిన సరోజ్ ఫ్యాబ్రిక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ స్టైలింగ్ నుంచి డిజైనర్ ఫ్యాబ్రిక్స్, అన్‌స్టిచ్డ్ షూట్‌లు, దుపట్టాల వరకు అన్నీ అందుబాటులో ఉన్నాయన్నారు. సరోజ్ ఫ్యాబ్రిక్స్ డైరెక్టర్ మోడీ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అతి పెద్ద సరోజ్ ఫ్యాబ్రిక్స్ షోరూం డిజైనర్లకు ఒక వరం అవుతుందన్నారు. పెళ్లి, రోజువారీ ఫ్యాషన్ ఫ్యాబ్రిక్‌ల కోసం ఈ స్టోర్‌ను ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దామని తెలిపారు.



కొండాంతా ఆరోగ్యం

బొటానికల్ గార్డెన్‌లో ఆదివారం చేవెళ్ల పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో యోగాసనాలు వేశారు. ఓ వ్యక్తి పడుకోగా ఆయన అరికాళ్లపై కూర్చొని ఆయన చేతులపై తన కాళ్లను పెట్టి గార్డెన్‌కు వచ్చే వాకర్స్‌కు రెండు చేతులతో నమస్కరిస్తూ ఆకట్టుకున్నారు. యోగాతో ఆరోగ్యం పదిలంగా ఉంటుందని రోజూ కాసేపు యోగా చేయాలని అక్కడికొచ్చిన సందర్శకులకు సూచించారు.

-గచ్చిబౌలి

విగ్రహా ప్రతిష్ఠాపనోత్సవాలు ప్రారంభం

రాయదుర్గం: ఎన్టీఆర్‌కాలనీలోని కోమటికుంట కట్టమైసమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. రెండు రోజులపాటు సాగే ఉత్సవాలలో మొదటి రోజైన ఆదివారం సాయంత్రం గణపతి పూజతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అఖండ దీపారాధన, రుత్వికారాధన, అంకురారోపనం, అధివాసములు, స్వాపనం, జలాధివాసం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ప్రతిష్ఠాపన..

రెండవ రోజైన సోమవారం ఉదయం 10.48 గంటలకు అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేసినట్లు గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. ప్రతిష్ఠాపన అనంతరం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి విగ్రహా ప్రతిష్ఠాపన అనంతరం అమ్మవారి దర్శించుకుంటారన్నారు.

డయాగ్నోస్టిక్స్ సెంటర్ ప్రారంభం


డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ప్రారంభించిన చిరంజీవి

మాదాపూర్: అధునాతన సదుపాయాలతో కూడిన డయాగ్నోస్టిక్స్ సెంటర్ పేద వారికి సైతం ఉపయోగపడేలా ఉందని నటుడు చిరంజీవి తెలిపారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన యోదా డయాగ్నోస్టిక్స్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్‌ను యోదా డయాగ్నోస్టిక్స్‌తో అనుసంధానం చేసి 14వేల మంది సినీ కార్మికులకు వారి కుటుంబాలకు హెల్త్‌కార్డులను మంజూరు చేశామన్నారు. అతి తక్కువ ధరలకే అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. మాదాపూర్ బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా యోదా అధినేత కంచర్ల సుధాకర్ యూటుబర్స్, ఇన్‌ఫ్లుఎన్సర్‌లకు హెల్త్‌కార్డులను అందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనరసింహ, దర్శకుడు కె.రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మణికొండ: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండి తమ రోజు వారి విధులను సక్రమంగా చేసుకోగలుగుతారని ఎంజీ పార్క్ యోగా నిర్వాహకుడు ఆనందరావు అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, ఎంజీ పార్కులో యోగా తరగతులు ప్రారంభమై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు యోగా తరగతులకు వచ్చి శిక్షణ పొందుతున్న వారిని అభినందించారు.